నిశిను చీకటి పొరలు విడలేదు. ఆకాశం తెల్లబారటానికింకా కొంత వ్యవధి వుంది. అక్కడో కాకి 'కావ్, కావ్'అంటూనో ఇక్కడో కోడి 'కొక్కొరోకో' అంటూనో ఆ నిశ్శబ్ద గంభీర సమయాన్ని భగ్నపరుస్తున్నాయి.

"పెద్దమ్మగోరో...దూడని ఉడిచినా... పాలచెంబియ్యండి." పాలేరు నరసన్న పెరట్లోంచి గావుకేక పెట్టాడు.

మధ్య సావిట్లో నులకమంచంమీద మగత నిద్రోతున్న రంగమ్మకి ఆ కేకతో తట్టి లేపినట్టుగా మెలకువ వచ్చింది.

బద్ధకంగా ఓ పక్కనించి మరో పక్కకి మసిలింది.

"అమ్మగోరో!" నరసన్న మరోకేక.

భారంగా కళ్లు విప్పి నెంపాదిగా లేవబోయింది రంగమ్మ. కానీ శక్తి ఉడిగిన కీళ్లు మూలుగుతూ కదలమని మొరాయించటంతో ఆమె ప్రయత్నం కొనసాగలేదు.

"పెద్దమ్మగోరూ... మిమ్మల్నేనుండీ ... పలకరేముండీ ..." అసహనంగా కేకమీద కేకగా అరుస్తున్నాడు నరసన్న పెద్ద గొంతుకతో.

క్రిందటి రోజు పొపుబస్తా అటుకులు దంపింది రంగమ్మ. చేతుల్లో సత్తువ చచ్చిపోయినా కోడలి మూతి విరుపులకి వెరిచి, కాకిమీదా, పిల్లిమీదా పెట్టి ఆవిడనే దెప్పి పొడుపు మాటలకి అభిమానపడి పళ్ల బిగువున పోటువేసింది. అలివి మాలిన చాకిరీ చేసినందుకు ఫలితం తెల్లవారే సరికి వంటిమీద కనిపిస్తోంది. అరవై ఏళ్ల జరాభారంతో పటుత్వం సడలిన కండరాలు పులిసిపోయాయి. నరాలు నీరసగించాయి. శరీరంలో వున్న కీళ్లన్నీ, "అరవై ఏళ్లు నీ మాట విన్నాం. ఇక వినం." అని ఘొరావో చేస్తున్నాయి.

'ఉహు. వాటిమొర ఆలకిస్తే ఎలా? ఊపిరున్నంతవరకో... పూర్తిగా మూలపడే దాకానో తనకీ శ్రమ తప్పనిసరి.' లేని ఓపిక కూడదీసుకుని చేతుల్తో మంచం పట్టీలు అదిమిపట్టి లేచి నుంచుంది రంగమ్మ.

గోడ ఆసరాగా అడుగులో అడుగు వేసుకుంటూ, తూలుతో వెళ్లి తలుపు తీసి నరసన్నకి పాలు తీసేటందుకు కంచు చెంబందించింది.

"ఏందమ్మా... ఈ దినం ఇంకా బట్టునే వున్నావ్;పాచి వాకిలన్నా ఊడిచినట్టు లేదే?" నరసన్న రంగమ్మకేసి ఒక చూపు విసిరి, జవాబుకోసం ఎదురుచూడకుండానే చెంబందుకుని గేదె దగ్గరికి పరిగెత్తాడు హడావిడిగా.

"ఇప్పటికే దూడ ఎన్నిపాలు కుడిచేసిందో ఏమో..." అనుకుంటూ.

నరసమ్మ అన్నది నిజమే. ప్రతి రోజూ తొలికోడి కూయకముందే లేచి, ఇల్లూ వాకిలీ



# ఆఖరి పోరాటం

అలివేలి నాగచంద్రావతి

ఊడ్చి, ముగ్గుపెట్టి, కళ్లాపి చల్లి, నీళ్లకి పొయ్యా, పాలకి దాలీ రాజేసి, నరసన్న రాకకోసం ఎదురుచూస్తూ వుంటుంది రంగమ్మ ఈ వేళకి.

సూరీడన్నా ఉదయించడానికి జాప్యం చెయ్యచ్చునేమోకానీ ఈ దినసరి కార్యక్రమానికి తాత్సారం జరగటానికి వీల్లేదు. అలా ఆలస్యం అయిననాడు కోడలు లక్ష్మీకాంత లేస్తూనే శివతాండవ నృత్యం చేస్తుందని రంగమ్మకి బాగా తెలుసు.

రంగమ్మ భయపడుతున్నట్టుగానే అన్ని పనులూ తెమలకముందే తెల్లవారిపోయింది. లక్ష్మీకాంత లేవనే లేచింది.

లేస్తూనే ఏడపిల్లాడు బాకా ఏత్తేసరికి పాలకోసం దాలిదగ్గరకు వెళ్లింది. మీగడ తరకన్నా కట్టని పాలు దానిమీద తెల్లబోతూ కనిపించాయి. అగ్రహారం ముంచెత్తటంతో చుట్టూరా చూసింది. నమిలి మింగాలనుకున్న అత్తగారు దరిదాపుల్లో కనిపించలేదు. ఇక ఎవరిమీద కక్కాలో తెలియని కోపాన్ని ఏడుస్తున్న కుర్రవాడి వీపుమీద చూపించటంతో వాడి రాగం తారస్థాయి నందుకుంది. రుసరుసలాడుతూ వాడి నక్కడ కుదేసి, పక్కవూళ్ళో హైస్కూలు చదువుకోసం వెళ్ళాలిసిన పెద్ద పిల్లాడు స్నానానికి తొందర పడుతోంటే నీళ్లపొయ్యకేసి నడిచింది.



లింటాస్-IODEX 3-40 TL

కాగులో చెంబుపెట్టి నీళ్ళు తొరప బోయే సరికి చలన్నా విరగని నీళ్ళు వెక్కిరించి నవ్వాయి.

నిప్పు తొక్కిన కోతిపలే అయింది లక్ష్మీకాంత. ఆమె నోటికి దురుసు హెచ్చు. విసిరే వాక్బాణాల ములుకులు మహవాడి. దూసే మాటల బాకులు చాలా పదును. అవి ఎవరిని ఎక్కడ బాధించాలో వారికే సూటిగా ఘాటుగా తగిలి నొప్పించగలవు.

వంగిపోతున్న నడుముతో మంచినీళ్ల బిందెత్తుకు వస్తున్న అత్తని చూస్తూనే గాలిదుమారంలా రేగింది లక్ష్మీకాంత.

''తేరగా తినటానికయితే మందిజనం ఇంటినిండా ఉన్నారుగానీ, కాస్త పాలూ నీళ్ళూ వెచ్చబెట్టి ఇచ్చే దిక్కుమటుకూ లేదు ఈ కొంపలో.'' లక్ష్మీకాంత కంచు కంఠం ఖంగున మోగింది.

కోడలి కఠిన స్వభావం ఎరిగినదే అయినా ఎప్పటికప్పుడు ఈ విసుర్లకి రంగమ్మ గుండె గాయపడుతూనే వుంటుంది.

'తనూ తన భర్తా సుఖంమాట తల పెట్టక, వయసులో పుండే కోరికల వూసెత్తక కూడబెట్టి కట్టుకున్న ఇల్లిది.

ముతక చీరలు కట్టి, నూకల కూడు తిని, డాబుసర్లకీ దర్జాలకూ పోక రాబడికి తగ్గట్టయినా ఖర్చుపెట్టక, కానికి కానీ వెనకేసి పెంచిన ఆస్తి ఇది.

తన కష్టఫలితాన్ని జుర్రుకుంటూ హంగు చేస్తున్న కోడలు ఈనాడు తననీ యింటికి పరాయిదాన్ని చేస్తోంది తేరతిండి తింటున్నా వంటోంది. రంగమ్మ మనస్సు చివుక్కుమంటోంది.

''అల్లా ఆ జగన్నాథం గారింట్లో వెంకాయమ్మ నయం-అగ్గగ్గలాడుతూ తెల్లవారే సరికి కాఫీ టిఫెన్లు సయితం అమర్చి వుంచుతుందిట. లక్ష్మీకాంత విసిరిన మరొక ఈటె. కోపం వచ్చినప్పుడు లక్ష్మీకాంత నోటివెంట వెలువడే పలుకులు విషం పూసిన ఛురికలే.

'వెంకాయమ్మ ఒక వంటమనిషి. ఆవిడకీ తనకీ సాపత్యం కడుతోంది లక్ష్మీకాంత. అదీ కోడలి దృష్టిలో అత్తకున్న విలువ. నీళ్ల బిందె తిన్నెమీద దింపి నీళ్లపొయ్యి విసిరేటంనుకు వెడుతూ వెలితిగా నవ్వుకున్నది రంగమ్మ

నిజమాలోచిస్తే రంగమ్మ అనుభవిస్తోన్న ఈ బానిసపు బ్రతుకు కంటే వెంకాయమ్మ జీవితమే ఎంతో మెరుగు.

వప్పుకున్న వంటసని మాత్రమే ఖచ్చితంగా చేసిపెట్టి నెలయ్యేసరికి ఏభయి రూపాయలు ఠంగున చేతిలో వేయించుకుంటుంది. ఏడాదికి నాలుగు చీరెలు నిలదీసి కొనిపించుకుంటుంది. పొరపాటుగా నయినా మాట తూలారంటే వాళ్ల అటు ఏడు తరాలూ ఇటు ఏడుతరాలూ తరించిపొయ్యేలా దుయ్యబట్టి, పరువు బజారుకీడ్చి ఆ ఇంటికి రాంరాం చెబుతుంది.

ఇంటి మనిషన్న మాటేగానీ రంగమ్మకేదీ ఆ స్వేచ్ఛ? రాత్రి నిద్రించే ఆ నాలుగు ఘడియలూ తప్పించి పగలంతా వేళాపాళా అనకుండా వంట దగ్గర్నించి పసివాడి పొత్తి గుడ్డలు శుభ్రం చేయటం వరకూ ఆపనీ ఈ పనీ అనే వివక్షతలేకుండా రెక్కలు విరుచుకొని పాటుపడుతుంది, వంటి మీదో బట్ట—బండమీదో బట్టగా ఇబ్బంది పడుతో వాడుకుంటుందే తప్ప మూడో బట్టకోసం నోరెత్తి అడగదు.

కోడలు తూష్కరించినా, కొడుకు మందలించినా, మనుమలు సయితం నిర్లక్ష్యంచేసి దులపరించినా నా వారేకదా నన్నన్నదని సరిపెట్టుకుంటుంది గానీ ఎదురు తిరిగి మాటకు మాట అప్పగించదు. సాధించినా, వేధించినా నా రక్తంలోరక్తం కదా వీళ్ళని అభిమానంగా కడుపులో దాచుకుని భూదేవిలా ఓర్పుకుంటుందే తప్ప పెదవి విప్పి పరులతో చెప్పకోదు.

ఈ విషయాలన్నీ లక్ష్మీకాంతకు తెలియనివా?

రంగమ్మ సహజంగా మేథకురాలు. బహుశా ఆ మెతకదనం చేతనే కోడలికి లోకువ అయిందేమో! ఆ లొంగుబాటు ధోరణి మూలాన్నే ఆ ఇంట ఆమెకు గౌరవం లేక పోతోందేమో!

లోలోపల బాధపడుతూ పని తప్ప పలుకెరుగని యంత్రంలా తలెత్తకుండా తన పని తాను చేసుకు పోతోంది రంగమ్మ. కానీ బలహీనతతో మనశ్శరీరాలు రెండూ అనారోగ్యంగా వున్న ఆ దుర్భరస్థితిలో రంగమ్మకి ప్రతిపనీ తడుముళ్ళాటగా వుండి కొంత తడవవుతోంది.

పైగా పొయ్యికూడా సరిగ్గా మండక అవస్థ పెడుతోంది. ఇంట్లో స్టౌవ్వూ, కుంపటీ వున్నాయి గానీ అవి లక్ష్మీకాంత మధ్యాహ్నం పూటలు తేలిగ్గా కాఫీ కాచుకుందుకో, నాజూగ్గా వుప్మా చేసుకుందుకో మాత్రమే పరిమితం. రంగమ్మ వంటకి ఎండీ ఎండని తాటికమ్మలూ కొబ్బరి మట్టలే ప్రాప్తి, ఊదుతూ విసురుతూ వాటితో నానా తిప్పలూ పడుతూ వుండగానే కొడుకు శేషయ్య వచ్చారు. రాత్రి పొలంలో కుప్పదగ్గర కావలా పడుకుని అప్పుడే ఇంటికి చేరాడతను.

వంటింటి ముందుకు వస్తూ, ''అమ్మా కాఫీ ఇస్తావా!'' అని అడిగాడు శేషయ్య.

పల్లెటూరిలో పుట్టి పెరుగుతున్నా పట్నవాసం అలవాట్లు కొన్ని జీర్ణించుకు పోతాయి కొంతమందికి. వాటిల్లో కాఫీ అలవాటొకటి. ప్రొద్దుటే కాఫీ పడకపోతే నిలవలేడు శేషయ్య.

''ఇంకా డికాషను కాగలేదు నాయనా! కొంత సేపు తాళు.'' పొయ్యి వూదుతూ మెల్లగా జవాబిచ్చింది రంగమ్మ

''ఎనిమిదవుతోంది. ఇంకా కాఫీ అన్నా కాచలేదా? ''నుదురు చిట్లించాడు శేషయ్య.

ఇంకాశాంతించలేదు లక్ష్మీకాంత.''యీము పొద్దెక్కేవరకూ మన ఇంట తెల్లవారదయ్యే: మరి కాఫీ తయారయ్యేసరికి సూర్యుడు నడినెత్తి కెక్కినా, భోజనాలయ్యే వేళకి పొద్దు వాటారినా, ఆశ్చర్య పోనక్కరలేదు.'' సావకాశంగా చంటివాణ్ణి అడ్డం వేసుకుని పాలిస్తూ భర్తకు వ్యంగ్యంగా సమాధానమిచ్చింది లక్ష్మీకాంత

ఆ అతిశయోక్తులు తనకే వర్తిస్తాయని లక్ష్మీకాంతకు మొట్టినట్టు చెప్పగలిగే ధీరులింకా పుట్టలేదు

'నువ్వూ అంతేగా!' అన్నట్టు భార్యకేసి ఎత్తిపొడుపుగా చూడబోయి, అంతలో ఆమె

## ఆత్మదీపం

నీలోను
నాలోను—
కరుడు గట్టిన
కాలకూట గరళాన్ని
తుదముట్టించి
మాలిన్యాన్ని కడిగి,
మమతను సృష్టించి,
మానవతను స్థాపించి,
కస్తూరి—చందన ముగ్గులు వేసి
ఆత్మ దీపం వెలిగిద్దాం!

—కె. బాలాజీ బాజీరావు

40 సం॥ అనుభవం
వరి బీజము బుడ్డలు బీజకుట్టు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
వివరములకు
రాజ్ అండ్ కో రిజిస్టర్డు ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట,
బాలాజీ బిల్డింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.
ఆఫీస్ ఫోన్: 42870, ఇంటిఫోన్: 38544

దైవ దర్శనం
అసలైన దైవ రహస్యాలు తెలుసుకోకుండా రోజూ దైవపూజ చేసే ఫలితంలేకపోగా, వానిన రోజున కీడు కలుగుతుంది. దైవాన్ని పొందిన వారెందరో వారి ప్రియ శిష్యులకు చెప్పిన, అనేక దైవ రహస్యాలు 'దైవదర్శిని' పుస్తకంలో ఉన్నాయి. అవి తెలుసుకొని మీ శక్తి శ్రమకుతగ్గ ఫలితాలు పొందండి. మూర్తి రచన.
ధర రూ. 10. పోస్టేజి రూ. 2.
'దేశసేవ', ఏలూరు—2, ఆంధ్రకు వ్రాస్తే మీకో పుస్తకం వి. పి. పోష్టులో వచ్చును.




# లోకం పోకడ

చూపు తన చూపులో కలవడంతో కలవర పాటుగా దృష్టి తల్లివైపు మరల్చుకుని,

"అది పిల్లలతో తొందరగా లేవలేదని తెలుసు గూదా...నువ్వయినాకొంచెం పెందలాడే లేవకూడదా అమ్మా!"అని విసుక్కున్నాడు శేషయ్య.

వంటిల్లంతా చుట్టేసిన పొగలో ఉక్కిరిబిక్కిరవుతున్న రంగమ్మకి కొడుకు విదిలింపు కొరడా ఝళిపించినట్టే అయింది.

వేదనతోనూ,వ్యధతోనూ ఆమె హృదయం భారమయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. వాడి ముడుతలుపడిన చెక్కిళ్ళు ఆశ్రువులతో తడిసాయి. నిస్పృహాయంగా కొంగుతో కళ్ళొత్తుకుంటూ పొయ్యిదగ్గర కూలబడి అదేపనిగా విసరసాగింది రంగమ్మ.

* * *

ఆ మధ్యాహ్నమే విత్తనాలకోసం కూలీల చేత వేరుశెనక్కాయలు ఒలిపిస్తున్నాడు శేషయ్య. ఆ చావిట్లోనే ఒక పక్కగా పనికి రాని బట్టల మూటల్లో, ఒడిలిన ఆకుల పోగల్లో, మునగదీసుకుని పడుకున్నది రంగమ్మ.

రోజల్లా గానుగ ఎద్దల్లే చాకిరీచేసే తల్లి అల్లా పనికి ఎగనామం పెట్టి పవ్వళించటం శేషయ్యకి మహా గుర్రుగా వున్నది.

వుండదూ మరి...! ఇప్పుడావిడ డ్యూటీ ఏవిటి? ఆ కూలీలతో సమానంగా కూర్చుని కాయలు ఒలవాలి; వాళ్ళని మంచిమాటలాడుతో చక చక పనిసాగేలా చూడాలి; మాటల్లో పెట్టి మరి నాలుగ్గింజలు ఎక్కువ దిగజారేలా కొలవాలి ఈ పనులన్నీ ఎగ్గొట్టి తనక్కానట్టు బబ్బుంటే మండదూ...?

అదే సమయానికి లక్ష్మీకాంత గూడా నుష్టుగా భోంచేసి పడగ్గదిలో బూరుగ దూది పరుపుమీద ఆపసోపాలు పడుతోవుంది' ఆ సంగతి గమనానికి లేదా శేషయ్యకి? అంటే... వుంది... కానీ అతని యోచనా వైఖరి ఎటువంటిదంటే—

వెనకటికి ఒక బిప్పగాడు, 'ఎప్పుడూ పెట్టని మహాలక్ష్మి ఈనాడూ పెట్టలేదు; సరే బాగానేవుంది. మరి రోజూపెట్టే దానికేమొచ్చిందో పెద్దరోగం ... ఈ రోజు పెట్టిందికాదు అనుకున్నాట్ట' అలాటిది.

'అది ఓనాడు శరీరాన్ని కనుగందనిచ్చింది గనుకనా ఈ వేళ ఒళ్ళు దాచుకుంటోంది అని వేలెత్తి చూపించడానికి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు, కోడల్ని చూసి ఉట్టవుడియంగా పుట్టుకొచ్చే ఈ ముసిల్దాని తెగులుకి అనుకోవాలి గాని.' లోలోపలే గుంజుకున్నాడు.

తెచ్చిపెట్టుకున్న ఆ ఓర్పూ ఆట్టే సేపు నిలవలేదు శేషయ్యకి. "ఏమే అమ్మా! ఉత్తినే అట్లా పడుక్కోకపోతే లేచి నాలుగ్గింజలు ఒలవరాదూ?" అన్నాడు లబ్జుగా.

అతనికి తల్లి నిద్ర నటిస్తోందనే అనుమానం. నూటికో కోటికో రంగమ్మ ఒక్కొక్కసారి అలక సాగించి ఈ విధంగా తన కోపాన్ని ప్రకటితం చేస్తూండటం కద్దు. పేదవాడి కోపం లాంటిది ఆ అలక. దాన్ని ఎవరూ లక్ష్యపెట్టరు. చివరాకరికి కొడుకు, 'ఇన్నేళ్ళొచ్చాయ్. నీకీ పిల్లంతనపు చేష్టలేమిటి? ఈ ముసుగు తన్నటంలాంటి పోకిళ్ళేమిటి? ఎవరయినా చూస్తే నవ్విపోగలరు 'చాల్చాల్లే గాని ఈపాటికి లే లేచి పని చూసుకో.' అని నాలుగు చివాట్లు పెట్టి కసరటంతో అంతమవుతూ వుంటుంది.

దానితో ఇంకా 'కొడుకు వస్తాడు. వచ్చి బతిమాలుతాడు;' అని ఆశగా ముసుగు బిడాయింపులోని ఉడకపోతలో క్షణాలు లెక్కపెడుతోన్న రంగమ్మ ఒక్కసారిగా స్పృహ తెచ్చుకుంటుంది. తనకాయింట వున్న స్థానమేపాటిదో గ్రహింపుకొచ్చి నిర్వికారంగా నవ్వుకుంటూ తిరిగి రొటీనులోకి జారిపోతూ వుంటుంది.

ఉదయంనించీ రంగమ్మ ఏవో పొరపాట్లు... ఆలస్యంగా నిద్రలేవటం దగ్గర్నించీ, డికాక్షన్ స్ట్రాంగుగా లేకపోవటం, కాఫీలో పంచదార ఎక్కువవడం, పప్పులో తాలింపు వేకపోవటం వరకూ చిట్టీ పొట్టీ పొరపాట్లు దొర్లిస్తూనే వుంది. పగవాళ్ళను సతాయించినట్టా వీణి కొడుకూ కోడలూ గూటిస్తూనేవున్నారు.

అదే తల్లి సత్యాగ్రహానికి కారణమనుకున్నాడు శేషయ్య.

దాన్ని ఎగరగొట్టే చిట్కా తన నాలుక కొననే వుందయ్యే. ఇంకాలస్యమెందుకూ...?

"అందరి చేలలో విత్తులు చల్లివారమయింది. మన పనిమటుకు ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసిన చోటే అన్నట్టు ఒలవటందగ్గరే నిలుగుతోంది.

ఏదీ-ఆ బెంగ నా ఒక్కడికీ తప్ప ఇంటి మనుషుల్లో ఏ ఒక్కరికన్నా కాబట్టిందీ...!

తెలిసీ తెలియని పిన్నలకయితే ఓ దెబ్బవేసి దారికి మలుపుతాం... అన్నీ తెలిసి కావాలని మూడంకె వేసే పెద్దలకేమని బుద్ధులు చెబుతాం. ఏళ్లు రాగానే సరా...?" శ్రావణ మాసం వర్షం-జలు జల్లుకీ మధ్యవిరామంలా వాక్యానికీ వాక్యానికీ నడుమ ఆపుతూ, ఆపి తల్లికేసి ఫలితం కోసం చూస్తూసాగించాడు శేషయ్య తన ప్రయోగాన్ని.

సహజంగా చాలా అభిమానవంతురాలు రంగమ్మ. మామూలుగానయితే ఆమెకీ మోతాదు చాలు; ఇహ మాటాడకుండా లేచి పనిలో జొరబడి పోవడానికి. కానీ ఈ రోజు ఏమైందో ఇన్నిమాటలన్నా ఆమెలో ఎటువంటి చలనమూ కలుగలేదు.

శేషయ్య సహనం పూర్తిగా అడుగంటింది. ఇక ఉరుములూ మెరుపులతో జడివాన కురిపించడమే తరవాయి.

ఇంతలో అటు ఓకగా రంగమ్మనే చూస్తూ వేరుశనక్కాయ వొలుస్తున్న ఒక కూలిమనిషికి సందేహమొచ్చి, "ఒదర మాకు బాబయ్యా. ఆయమ్మ ఏటికో ఒణుకుతుంది. దాపలకెళ్లి మీన సెయ్యేసి సూడు "అని సానుభూతితో సలహా యిచ్చింది.

వినంగానే నమ్మలేని విషయాలుంటాయి కొన్ని.

ఫారిన్‌లో తయారయిన వస్తువుకన్నా ఇండియా సరుకు మన్నిక ఎక్కువన్నా;

ప్రజలు అవిశ్వాసం ప్రకటించకుండానే తన అప్రయోజకత్వాన్ని అంగీకరించి పదవీ సింహాసనాన్నించి దిగిపోయే నిజాయితీ గల మంత్రివర్యుడన్నా;

అమెరికా పెట్టిన అప్పు నయాపైసల్తో సహా ఇండియా తీర్చేసిందన్నా...

నిన్న ఆకాశాని కెగిసిన ధరలు ఈవేళ నేలబారుకి పడిపోయాయన్నా ... గబుక్కున నమ్మలేం.

బాహాటంగా అనకపోయినా ఇలాంటి అసంభవమయిన విశేషాల్లో తన తల్లి అనారోగ్యానికి గురికావట మన్నది కూడా చేర్చవచ్చని శేషయ్య నమ్మకం.

సన్నగా రివటల్లే ఉన్నా రంగమ్మకి ఓరుపు గుణం మెండు. చిన్న చిన్న నలతలని సరుకు చెయ్యదు. లక్ష్మీకాంతలా గోరంతని కొండంత చేసి ఇస్సో- అస్సో అనదు. కనీసం ఒంట్లో బాగులేదని గూడా బయటపడదు. అదేపోతుంది లెమ్మని తోసుకు తిరుగుతుంది. చెప్పుకోదగ్గ పెద్ద సుస్తీలెప్పుడూ రాలేదు కూడా.

"నీ శరీరం ఫారిన్ మేడ్ అమ్మా" అంటుంటాడు శేషయ్య ఛలోక్తిగా. అలాటి శేషయ్య ఇప్పటివరకూ తిరుగుతోన్న తల్లికి అంతలో పడక పెట్టేటంతగా ముంచు కొచ్చిందంటే నమ్ముతాడా ?

అపనమ్మకంగా రంగమ్మ మొహంమీది ముసుగుతప్పించి మెడమీద చెయ్యి వెయ్య వెయ్యబోతూ స్తంభించిపోయాడు శేషయ్య.

రంగమ్మ మూతి వికారంగా ఓపక్కకి తోసుకుపోయింది విపరీతమైన ఉష్ణంతో ఒణుకుతోంది శరీరం. కూలిమనిషి సాయంతో మంచంమీదికి చేరుస్తోంటే ఆమె కుడి పార్శ్వం జీవంలేనట్టు వేలాడిపోయింది.

డాక్టరువచ్చి ఫీజు గుంజకుండానే రంగమ్మకువచ్చిన రోగమేమిటో తేల్చి చెప్పేసింది కూలిమనిషి. "పక్షవాతం! పెద్దతనాన వచ్చిన రోగమిది. ఇంకేం తగ్గుద్ది ... ఇక మంచాన ఉండాలిసిందే." అని.

* * *

రంగమ్మ పెద్దకొడుకు నాగయ్యకూడా ఆవూర్లోనే ఉంటున్నాడు.

తల్లి ఇలా మంచాన పడ్డసంగతి శేషయ్య అన్నగారికి కబురుచేశాడు. ఆదరా బాదరా పరిగెత్తుకువచ్చాడు నాగయ్య.

అప్పటికే సావిట్లో ఉన్న రంగమ్మని సామాన్లగదిలోకి మార్చేశారు నాగయ్య వస్తూనే తల్లిదగ్గరకు చేరిపోయాడు. తల్లి పడుకున్న నులక మంచంమీద కూర్చొని, 'అమ్మా! అంటూ ఆప్యాయతగా' ఆరాటంగా పలకరించాడు స్పృహలోనే వున్నది రంగమ్మ. కొడుకు హస్తాన్ని తన చేతిలోకి తీసుకుని కన్నీరు పెట్టుకుంది.

కన్నతల్లిని ఆ దీనస్థితిలో కాంచిన నాగయ్య కళ్లుకూడా ఆర్ద్రమయ్యాయి. తెలియకుండానే మనసు అవ్యక్తమైన ఖేదానుభూతికి లోనయి విలవిల్లాడింది.

ఆ గాఢమయిన వేదనోద్వేగం కొంత సడలబడిన పిదపగానీ తల్లి నెక్కడుంచారో గుర్తించలేదు నాగయ్య.


చెమ్మగిలి మసగబారిన కళ్లతో చుట్టూ చూశాడు.

విరిగిన చెక్కసామానూ, అరిగీ, చిల్లుబడీ, అక్కరమాలిన పాత్ర సామానూ, పాత గోనె సంచులూ మొదలైన పారెయ్యలేనివీ పనికి రానివీ అయిన సామాన్లతో మూడువంతులు నిండిన ఆ గది వికలాంగుల శరణాలయంలా వున్నది.

వాడిక లేకపోవటం మూలాన్ని, శుభ్రం చెయ్యటంకూడా అరుదేమో ... ఇంతెత్తున దుమ్ము పేరుకుని ట్రంక్ రోడ్డు పక్క పశువుల శాలలా గలీజుగా వుంది.

స్తంభాలాట ఆడుకుంటున్న పిగ్గో పిల్లల్లా ఎలుకలూ, చుంచులూ చిందులేస్తూ ఆ కలుగులోంచి ఈ కలుగులోకీ, ఈ కలుగులోంచి ఆ కలుగులోకి పరిగెత్తుతున్నాయి.

కిటికీలు లేకపోవటం మూలాన్ని వెలతురనే దేవత ఆ గదిమీద అలుకబూని రావటం మానుకున్నది.



వాయుదేవుడు భీకరాకారంతో ప్రళయ ఝ ఝూ మారుతాన్ని వీస్తూ లోకాన్ని వూప గలడేమో గానీ ఆ గది ఛాయల్లోకి మాత్రం రాలేదు.

ఆకారాలు గుర్తింపగలిగేటంత కాంతిని

# లోకం పోకడ

విడుస్తున్న బెడ్‌లైటు ఒకటి ఇంతోటి వైభవానికీ నేనుచాలనా అన్నట్టు ధీమాగా వెలుగుతోంది అక్కడ.

ఖరీదైన షాంపూలు మీరు వాడుతున్న ప్రతిసారి
మీ డబ్బు నీళ్ళపాలే—అందుకే తలంటుకోనేందుకు వాడండి..

卐 స్వస్తిక్
షికాకాయ్
షాంపూ సబ్బు

ద్రవపదార్థపు షాంపూలలోగల
అన్ని లక్షణాలు ఉన్నా
ఖరీదు మాత్రం తక్కువే!




卐 స్వస్తిక్ షికాకాయ్ షాంపూ సబ్బులో
భారత స్త్రీల అందమైన జుట్టుకు పారంపర్యమైన
రహస్యం షికాకాయ్ ఉంది.

అటువంటి గదిలో కుక్కి మంచంమీద ముసలిదీ, రోగిష్టిదీ అయిన రంగమ్మ విరిగిన సామానుల్లో తనూ ఒక సామానులా రెక్కలు విరిగిన పక్షిలా దీనంగా పడివుంది.

ఉవ్వెత్తున పొంగుకొస్తున్న ఆక్రోశాన్ని ఆపుజేసుకుంటూ, ఇంతకంటే 'మంచిచోటు దొరకలేదు కాబోలు, అమ్మని పడుకోబెట్ట డానికి!' అనుకున్నాడు నాగయ్య.

సహజంగా మేధకుడు అవటంనించి గద్దించి అడగలేక, "అమ్మని నడవాలోనే ఉంచితేనేం...? ఇక్కడ గాలీ వెలుతురూ బొత్తిగా రాటంలేదు." అన్నాడు మెల్లగా తమ్ముడితో.

తికమక పడ్డాడు శేషయ్య. "అబ్బే... ఇక్కడయితే అడ్డంలేకుండా వుంటుందని కాంత అంటేనూ..." అంటూ తడబడ్డాడు.

శుష్కహాసం చేశాడు నాగయ్య.

'మరే... అడ్డేమరి. పందిరి మంచం బాగున్నన్నినాళ్ళా అందరమూ ఎక్కితొక్కాం. కోళ్ళు విరగంగానే సావిట్లో అడ్డుగావుందని కుసులూడదీసి కట్టగట్టి ఈ గదిలోనే పారేశాం. నిజమే అమ్మ నిక్కడుంచటమే సమంజసమేమోలే...'

బావగారి సూచనకి లొంగిపోయి భర్త "సరే"నంటూ ఎక్కడ బుర్ర వూపేస్తాడో అని ఆత్రంగా అతనివంకే చూస్తున్న మరదల్ని గమనించాక అనాలని అనుకున్నవన్నీ పైకనలేక పోయాడు నాగయ్య. నిట్టూర్చి వూరుకున్నాడంతే.


తల్లి చేతిస్పర్శ వెచ్చగా తాకుతోంది వంటిని. "డాక్టరుగారికి కబురు పంపావా ?"! అన్నాడదుర్దాగా నాగయ్య.

"ఆఁ — ఆ. ఆచారిగారు వచ్చి చూసి వెళ్ళారిందాకనే." బుద్ధిమంతుళ్ళా సమాధాన మిచ్చాడు శేషయ్య తల వూగిస్తూ.

ఆ వూళ్ళో ఆయుర్వేద వైద్యుడిగా చెలామణీ అవుతున్న మహానుభావుడు ఆచారిగారు. ఆయన ప్రొద్దుట లేస్తూనే కల్వంలో ఏవో నాలుగు దినుసులు వేసి నూరి మాత్రలు కట్టి పెట్టుకుంటాడు... ఏ ఏ దినుసులు వేస్తాడో ఆయనకీ ఆపైవున్నవాడికీ తప్పించి మూడో వాడికి తెలియదు.

ఇక రోజంతా వచ్చే రోగులందరికీ... వాళ్ళు ఎన్నెన్ని రకాల బాధలు వెళ్ళబోసుకోనీగాక... అన్నింటికీ ఆ కల్వంలో మాత్రలే మందు; ఒక్కటే అనుపానం.

# నాస్తికమతాలు ఆస్తికమతాలు




ప్రపంచంలో ఎన్నో మతాలు ఉన్నవి. కొన్నిటికి దేవుడు ఉన్నాడనే నమ్మకం ఉంటుంది. కొన్నిటికి అట్టి నమ్మిక ఉండదు. భగవంతుని పై నమ్మకం ఉన్నా, లేకపోయినా— ఆ యా మతప్రవక్తలు తమ తమ మార్గాలలో మానవాభ్యున్నతి కొరకే పాటుపడ్డారు. ప్రచారాలు సాగించారు. అవి సాగుతునే ఉన్నవి. ఇకమీదనూ సాగగలవు.

మనదేశంలోని మతాలు ఆస్థికములనీ, నాస్తికములనీ రెండు రకాలు. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించే మతాలు ఆస్తికమతాలు. దాన్ని అంగీకరించనివి నాస్తికమతాలు—అంటే అవైదిక మతాలు.

మనదేశంలో ద్వైతం,అద్వైతం, విశిష్టాద్వైతం అనే ఆస్తికమతాలు బహుళ ప్రచారంలో ఉన్నవి. నాస్తికమతాలలో బౌద్ధమతం, జైనమతం ప్రధానమైనవి. గౌతమబుద్ధుడు స్థాపించిన బౌద్ధమత సిద్ధాంతాలు ఇవి— ''ఆశ ఉండడం వల్లనే జీవితం దుఃఖమయమౌతుంది. ఆ ఆశను విడిచిపెట్టినప్పుడే మానవుడు ముక్తిని పొందగలడు. ఆ ముక్తిని పొందుటకు అష్టవిధ మార్గాలు తల్పబడినవి.

జైనమతంలో అహింసకూ, వైరాగ్యానికీ ప్రాధాన్యం ఇవ్వబడింది. ఆ మతాన్ని అవలంబించినవారు జనసామాన్యానికి ముఖ్యములైన అహింస, సత్యం, అస్తేయం, అపరిగ్రహం అనే నియమాలకు కట్టుబడి వుంటారు. సత్యాహింసలు అందరికీ తెలిసినవే. అస్తేయమంటే— ఇతరుల సొత్తును అపహరించకుండా ఉండటం. అపరిగ్రహమంటే ఇతరులు ఏమి యిచ్చినా తీసుకొనకుండా ఉండడం. వీటికి తోడుగా బ్రహ్మచర్యాన్ని కూడా మహావీరుడు చేర్చాడు.

మానవ జీవితాన్ని సరిదిద్దడమే ఈ మతద్వయం యొక్క ప్రధాన లక్ష్యంగా కానవస్తుంది.

ఆస్తిక మతాలు లౌకిక విషయాలకంటె పారలౌకికాలకే ప్రాముఖ్యం ఇస్తున్నవి. సంసార బంధం నుంచి విడుదలపొందే మార్గం బోధించడం, తత్వజిజ్ఞాస వీటిలో ముఖ్యం. అహింస, సత్యం, అస్తేయం, అపరిగ్రహం మానవజాతికి సామాన్య ధర్మాలు కావడంవల్ల, అవి కూడా ఈ మతాలలో మిక్కిలి ఆదరణీయాలే. అయినా — అంతతో తృప్తిపడకుండా పారమార్థిక విషయాలకే ప్రాధాన్యం ఇస్తూ ఉన్నవి.

ఏమయినా — అన్ని మతాలలోను మానవాభ్యుదయానికి సముచితమైన స్థానం ఉన్నదనీ, దానిని సాధింప గలిగినప్పుడు మత విద్వేషాలకుగాని,మతాభినివేశానికిగాని అవకాశం లేదనీ గ్రహించాలి.

---

ఇంగ్లీషు వైద్యానికి తూగలేని బీదా బిక్కీ జనమో, లేకుంటే ఏ ఔషధమూ సేవించకుండానే నాలుగు రోజులు ఓరిస్తే వాటంతట అవే వెనకబట్టే రోగాలు... జలుబూ, దగ్గూవంటి కాలికమైన సుస్తీలకో వెడుతూంటారాయన దగ్గరకు.

అసలు వైద్యం చేయించలేదనే నెపం లేకుండా, కేవలం కన్ను తడుపుకూ, మనసును మభ్యపరిచేటందుకూ మాత్రమే ఉపయోగపడుతుందాయన వైద్యం.

మరోసారి భారంగా నిట్టూర్చి 'ఏమన్నారాయన?' అని ప్రశ్నించాడు నాగయ్య.

'పెద్దతనం. కాలూ, చెయ్యీ రావటం కష్టమేనన్నాడు. జ్వరం తగ్గడానికి మాత్రలు ఇచ్చి వెళ్లాడు.'

'తల్లి ఇకపైన లేచి తిరుగాడలేదు. 'నాయనా నాగయ్యా!' అని తనని పిలవలేదు.' అనుకుంటే కడుపులో దుఃఖం సుడులు తిరుగుతో పైకుబుకుతోంది.

''కొడిగడుతున్న దీపం కొండెక్కడానికి ఎంతోకాలం పట్టదు శేషూ! ఈ నాల్గునాళ్లూ సేవించుకొనే భాగ్యఫలమే మనకు దక్కేది. అమ్మను జాగ్రత్తగా చూసుకో.'' అన్నాడు నాగయ్య డగ్గుత్తికతో.

బావగారు వెళ్లిన తరవాత మగని మీద విరుచుక పడింది లక్ష్మీకాంత.

''అట్లా చూసుకో — ఇట్లా చూసుకో అని మనకి ఆజ్ఞలు జారీచేసే బదులు అంత బిమానం గలవాడు తన ఇంటికే తీసికెళ్లి అత్తారుబతంగా చూసుకోవచ్చుగా? అయినా మీరు మాత్రం అట్లా నోట్లో బెల్లంగడ్డ పెట్టుకు వూరుకోకపోతే, 'నువ్వూ కొడుకువే గదా తీసుకువెళ్లి ఆ చెయ్యాలిసిన సేవలేవో నువ్వే చెయ్యమని చెప్పలేరూ మొహాన్ని?'' అంటూ గనమాయించింది.

భార్య ధోరణికి శేషయ్యకి తటు గాలి రేక్కొచ్చింది''చెపుదునేచెపుదును కానీ 'చాకిరీ చేయించుకున్నది నువ్వూనూ, సేవలు చేయడానికి నేనూనా?' అని నా మొహాన్నే ఎదురు దులుపుతాడేమోనని బయపడి వూరుకున్నాను. చేతనయితే నువ్వే అను; ఆ పడాల్సిన నాలుగూ కూడా సువ్వే పడు.'' అంటూ దులిపి విసురుగాలేచి చక్కాపోయాడు.

మొట్టినట్టయి మౌనంగా వుండిపోయింది లక్ష్మీకాంత.

* * *

శేషయ్య అన్నదాన్లో అతిశయోక్తేమీ లేదు. రంగమ్మ రెక్కల కష్టం అధికంగా జుర్రుకున్నది శేషయ్య కుటుంబమే.

లక్ష్మీకాంత కాపురానికి వచ్చిన కొత్తలోనే అన్నదమ్ములిద్దరూ వేర్పాటు అయ్యారు.

ప్రాణంలేని పొలం పుట్రా, నోరులేని గొడ్డూ గోదాతోపాటు కన్నతల్లిని గూడా పంచేసి అన్నదమ్ములిద్దరూ తల్లిని చెరి ఆరునెలలూ పోషించాలని తీర్మానించారు పెద్దలు.

కానీ ఆ తీర్మానం అంత నిక్కచ్చిగా అమలుజరపడం పడలేదు: శేషయ్య దగ్గర వుండే గడువు కాలం పూర్తి అయ్యేవేళకి లక్ష్మీకాంతకి వేవిళ్లు. మంచం దిగటంలేదు. ''తొలిచూలు వేవిళ్లతో నలుగుతోంది తరవాత వస్తాలే.'' అన్నది రంగమ్మ. కాదన

## నమ్మూ నమ్మకపో!

సేకరణ : బి. శ్రీదేవి

### కల్తీ ప్రభావం!

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అజంతా గుహలలోని చిత్రాలమీద తెల్లనిపూత ఏర్పడి బొమ్మలు మాసిపోతున్నాయి.

కారణం ?

బొమ్మలు మాసిపోకుండా ఉండడాన్కి వాటిపై ఒక రకమైన ఇటాలియన్ వార్నిష్ పూశారట, ఈమధ్య, ప్రభుత్వంవారు అయితే ఈ వార్నిష్ చవకబారుది అవడంతో, బొమ్మల మీద తెల్లనిపూత ఏర్పడుతోందట.

### కోతీ–మనిషీ!

"ఇక బతకడు" అనుకొన్న 13నెలల బాబుని 16 గంటలపాటు ప్రాణాలతో నిలిపారు హేర్‌ఫీల్డు ఆసుపత్రి (లండన్) కి చెందిన డాక్టర్లు. ఇక ఆగిపోతుంది అనుకున్న బాబు గుండెను రక్తనాళాలతో ఒక కోతి గుండెకు కలిపారు. దానితో బాబు 16 గం.లు బ్రతికాడు. ఇంకా బ్రతికేవాడే కాని ఈలోగా కోతి మూత్రపిండాల్లో లోపం కలగడంతో కోతి చచ్చిపోయింది.

ఇలాంటి ప్రయోగం ప్రపంచంలో యిదే మొదటిది

### మావ్ జేదాంగ్!

తమ పేర్లను విదేశీయులు పలుకుతున్నతీరు చూచి బాధపడి, చైనావారు తమ పేర్లను ఎలా వ్రాయాలో, ఎలా చదవాలో తెలియజేసే పుస్తకాల్ని ముద్రిస్తున్నారు. "మావ్ సేటుంగ్"ని "మావ్ జేదాంగ్" అనీ "చౌ ఎన్ లై"ని "జో ఎన్ లై" అనీ "పీకింగ్"ని "బీజింగ్" అనీ చదవాలట!

## లోకం పోకడ

లేకపోయాడు నాగయ్య. రెండు బస్తాల ధాన్యమూ రెండు జతల పంచలూ తల్లికి పంపించి వూరుకున్నాడు.

ఆ తరవాతైనా అవసరార్థం ఏవో నాలుగు రోజులు వుండడం తప్పించి నాగయ్య ఇంట్లో వుండటం పడేదికాదు రంగమ్మకి.

లక్ష్మీకాంతకి దగ్గర కాన్పులు చంటీ ఎంటూ. శేషయ్య ఇల్లు వదలటానికి రంగమ్మ కెప్పుడూ మనసుపడేదికాదు భార్య అనారోగ్య దృష్ట్యా తల్లి అవుసరం తనకీ వున్నా మనవలని ముద్దుచేసే మురిపంలో రంగమ్మ కూడా అటువైపే మొగ్గు చూపుతూండటంలో అభ్యంతరం చెప్పలేక పోయేవాడు నాగయ్య

దానాదీనా రంగమ్మ చిన్నకొడుకు ఇంటనే స్థిరమయిపోయింది నాగయ్య తల్లి ఖర్చు నిమిత్తం సాలుకీ రెండు బస్తాల ధాన్యమూ, బట్టలు కొనడానికయి కొంత పైకమూ తమ్ముడి కివ్వటం అలవాటు అయింది.

కాలమెప్పుడూ ఒకే విధంగా సాగిపోదు అనుకోని మలుపులు తిరిగి మానవాళిని దిగ్భ్రాంతుల్ని చెయ్యటం దాని సహజ నైజగుణం.

అన్నిటా శేషయ్యని అనుగ్రహించిన విధి నాగయ్యపట్ల వివక్షం చూపింది.

నాగార్జునసాగర్ పుణ్యమా అంటూ శేషయ్య మెట్టపొలాలు మాగాణమై బంగారు పండింది. దానితో, అతనికి సిరి ఎత్తుకుంది అతని గాదెలు పంట మాలక్ష్మితోనూ, అతని ఇల్లు పిల్లా పాపాతోనూ కల కలలాడేయి అతని జీవితం మూడు పువ్వులూ ఆరు కాయలుగా విలసిల్లింది.

వ్యవసాయంమీద మనసులేక అయినకాడికి భూములు తెగనమ్మి వ్యాపారంలోకి దిగిన నాగయ్య అదృష్టం వక్రించింది. అంతా నష్టపోయాడు. అంతేకాదు విధి అతన్ని పలు విధాలుగా వంచించింది.

వ్యాపారంలో నష్టపడి ఆర్థికంగా దిగజారి పోవటమే కాకుండా, పిల్లలు కలగక పోవటం ఒక వెలితిగా, భార్య దీర్ఘవ్యాధి గ్రస్తురాలు కావటం మరొక కలతగా అతన్ని కృంగ దీసింది.

పెనుతుఫాను తాకిడికి కొమ్మలు రెమ్మలు విరిగిన వృక్షం మీద పిడుగుపడినట్టు పరిస్థితుల ఒత్తిడికి డస్సిపోయిన అతనిని విధి పగ పట్టినట్టు మరొక పిడికిలిపోటు పొడిచింది. అతని రోగిష్టిభార్య కన్నుమూసి అతన్ని ఒంటరిని చేసింది.

జీవితంలో అడుగడుగునా ఎదురు దెబ్బలు తిన్న వ్యక్తి చుట్టూరా ప్రపంచంమీద కసి పెంచుకుని దుర్మార్గుడయినా అవుతాడు; లేక కోరికల కతీతుడై విరాగి అయినా అవుతాడు.

నాగయ్యను చుట్టుకున్న బవబంధాలను ఈవిధంగా సడలించి అతన్ని తనవైపుకు మరల్చుకున్నాడా దైవం.

శాంత స్వభావుడైన నాగయ్య తనకు సంభవించిన ఈ విపత్తుల క్లేశభారం భగవంతునిపరం గావించి విముక్తుడయ్యాడు.

దైసందిన నిత్యకృత్యాలకు అవసరమయ్యే ఏ కొద్ది కాలమో మినహా మిగతా సమయాన్నంతా ఆధ్యాత్మిక గ్రంథ పఠనంలోనూ, దైవధ్యానంలోనూ గడుపుతూ వస్తున్నాడు ప్రస్తుతం

మోడుబారిన కొడుకు బ్రతుకుని తలచి ఎంతయినా పరితపించేది రంగమ్మ.

ఉండబట్టలేక ఒకసారి, "ఆడదక్షత లేని సంసారమయింది వాడిది. ఒక్కడూ చెయ్యి కాలుకుని ఏమియాతన పడుతున్నాడో ఏమో .. పోనీ నేను వాడిదగ్గరకు వెళ్లి వుందునా?" అని తన అభిలాషను వెల్లడించింది.

కానీ అందుకు శేషయ్యగానీ లక్ష్మీకాంత గానీ సుముఖత వ్యక్తపరచలేదు.

"అన్నయ్య స్థితి ఏమంత వెలిగిపోతోందని నువ్వు అక్కడికి జేరతానంటున్నావమ్మా? ప్రతి ఏడూ నీకని ఇస్తున్న కొద్దిపాటి మొత్తంకూడా ఈ ఏడాది ఇవ్వలేక పోయాడు తెలుసునా? వాడి భుక్తికే కట కట పడుతూంటే నువ్వు వెళ్ళి మరో భారం వాడి భుజాన మోపుతా నంటావేమిటి?" అని సన్న సన్నగా శేషయ్య మందలించగా –

కట్టుగొయ్యకు కట్టడానికి ప్రయత్నించే పాలేరుకి అలివిగాకుండా గింజుకుంటున్న ముసలిగేదెమీద పెట్టి, "ఒదిలెయ్యరా ఎక్కడికెడుతుందోనూ... రెండు రోజులు డొక్క మాడితే ఇల్లెక్కడుందా అని అదే వెతుక్కుంటూ వస్తుంది ముప్పొద్దులా మేపి సుఖంగా ఒకచోట పడుండవే అంటే నీలుగుతోంది...నీలుగు."అంటో పరోక్షంగా అత్తగారిని వెటకారంగా ఈసడించింది లక్ష్మీకాంత.

ఇందులో భార్యా భర్త లిద్దరూ కలిసి

మరుగుచేసిన విషయమొకటున్నది. నాగయ్య తల్లికంటూ ప్రతిఏడూ ఇస్తున్న మొత్తాన్ని ఆఏడు ఇవ్వలేకపోయిన మాట వాస్తవమే. అలా ఇవ్వలేక పోయినందుకు చాలా కించపడ్డాడతను. ఆ సంగతి తమ్ముడితో చెప్పలేక చెప్పలేక చెబుతూ, "పోనీ అమ్మని నా దగ్గరికి పంపెయ్యి. ఉన్నదానిలోనే కలో గంజో తాగుతాము. అయినా ఒకసారిగా అంటే ఇవ్వలేనుగానీ దినసరి బత్యానికి లోటు లేదులే నాకు." అని తనకు వెసులుబాటుగా వుండే మార్గాన్ని సూచించాడు.

[ఇంకా వుంది]






లింటాస్-TIC.P-1-140 TL

పెద్దకథ

# లోకం పోకడ

వలివేటి నాగచంద్రావతి

[గత సంచిక తరువాయి]

ఏంతుకోసం తల్లిని అన్నగారింటికి తరిమితే నలుగురు పిల్లలున్న తన ఇంట ఒక్క ఘడియ సాగదనీ, తల్లి లేకపోతే లక్ష్మీకాంత ఏలుబడిలో ఆ ఇంటతనకు అడపాదడపా మడత కుదుములు ప్రాప్తిస్తాయనీ శేషయ్యకు బాగా తెలుసు.

అంచేత అన్నగారి మాటలకు మహా నొచ్చుకుంటున్నట్టు మొహం పెట్టి 'అదేవిటన్నయ్యా అమ్మ నీ ఇంటోవుంటే ఒహటీ నా ఇంటో వుంటే ఒకటీనా ? అలాగ ఎప్పుడూ అనుకోకు అయినా...నువ్వేమనుకో నంటే ఒక్కమాట ! అమ్మకి మీ ఇంట్లో ఏం తోస్తుంది చెప్పు ... ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ... మా ఇంట్లో అంటావా పిల్లాజెల్లా.. తెలియకుండానే పొద్దు గడిచి పోతుంది అదీగాక పెద్ద తనాన పడిందా ... ఏదో జిహ్వా చాపల్యం.. అదీ ఇదీ తినాలనుం టుంది. మా ఇంట్లో అయితే అన్నీ సమృద్ధిగా వుంటాయి. మనం ఇప్పుడు చూడాల్సింది వంతులుగాదు; ఆవిడ సుఖం. అమ్మని నాదగ్గరే వుంచుకుంటాలే నువ్వేం బాధపడకు'' అన్నాడు తన ఉదాత్తత ప్రకటించుకుంటూ.

మనస్సు చివుక్కుమన్నా, ''నిజమంతే గదా.'' అనుకుంటూ మౌనంగా వూరుకున్నాడు నాగయ్య

ఇదేమీ తెలియదు రంగమ్మకి. అంచేత కోడలి తృణీకారానికి పౌరుష మొస్తున్నా, రానురానూ ఓపిక వుడిగి ఇంటెడు చాకిరీ చెయ్యలేకపోతున్నా, పెద్దకొడుకు దగ్గరకు వెళ్ళిపోవాలని ఎంతగా అనిపిస్తున్నా, శేషయ్య గుర్తుచేసిన పెద్దకొడుకు ఆర్థికస్థితి ఆమెను పగ్గంవేసి వెనుకంజ వేసేలా లాగేది.

''సాయంపేరిట వెళ్ళి వాడికి అదనపు భారం అవనా' అనుకున్న రంగమ్మ తన అభిమానాన్ని ఎప్పటికప్పుడు అణగదొక్కుకుంటూ చిన్నకొడుకు ఇంట్లోనే వుండక తప్పింది కాదు

అలాగ ఆవిడ రెక్కలు బాగున్నన్నినాళ్ళూ చాకిరీ చేయించుకోవటమే కాకుండా, మహా ఉదారుళ్ళా అన్నగారికి భరోసా ఇచ్చిన శేషయ్య ఈరోజు '' అమ్మని తీసుకెళ్ళమని '' ఏ మొహంతో అనగలడు ?

*   *   *

మూడురోజులు భారంగా గడిచాయి. జ్వరం దిగజారడం తప్ప రంగమ్మ స్థితిలో పెద్ద మార్పేమీ రాలేదు రోజూ ప్రొద్దుటా సాయంత్రమూ నాగయ్యా తల్లిని చూచి పోతున్నాడు.

ఈ మూడురోజుల్లోనే తల్లికి అక్కడ జరుగుతున్న రాజభోగం అవగాహన మయి పోయిందతనికి.

మొదటిరోజు అతను వెళ్ళేసరికి తెల్లవారి పదిగంటలయింది. అప్పటికింకా తల్లి మొహం కడిగించి ఇంత ధారకం పోసిన వాళ్ళులేరు. తమ్ముడు ఇంట్లో లేడు. మరదలు లక్ష్మీకాంత పీకమొయినా వంటపనిలో మునిగిపోయి పిలిస్తే కరిచే మూడ్‌లోవుంది.

ఇహానప్పుడు తానే చెయి చేసుకుని తల్లి మొహం కడిగేడు సంకోచిస్తూనే మరదల్ని కదిలించి సగ్గుజావ కాయించి తల్లికి తాగించి వెళ్ళాడు.

మరునాడూ సరిగ్గా అదే తీరు. ఆవేళయితే శేషయ్యకూడా ఇంట్లోనే వున్నాడు. నీరసంగా వేలాడిపోతూ దైన్యం వెలిగక్కే చూపులు చూస్తున్న తల్లినిచూచి దీర్ఘంగా నిట్టూర్చాడు నాగయ్య. నేరస్తుడిలా తలవాల్చుకున్నాడు శేషయ్య.

ఆ తరవాత తర్తలడిపోతూ పెళ్ళాన్ని కేకేసి తల్లికి మొహం కడగమనీ, పాలు ఇవ్వమనీ, అధారిటీగా ఏదో పురమాయించబోయాడుగానీ మాజీమంత్రిగారి రికమండేషన్‌లా మొగుడిమాట ఏమాత్రం లక్ష్యం చెయ్యని లక్ష్మీకాంత ముందు ఆ ఆజ్ఞలు చెల్లుబాటు కాలేదు.

నిప్పు ముట్టించిన టపాకాయలా లక్ష్మీకాంత వంటఇంట్లోంచే ఖయ్యిమంది.



## నమ్మా నమ్మకపో!

### మంత్రగాండ్ర సభ!

బొగొటా అనే నగరంలో ఆగష్టు నెలలో ఒక అపూర్వమైన సభ జరుగుతుంది. ప్రపంచ ప్రఖ్యాతులైన మంత్రగాళ్ళూ, మంత్రగత్తెలూ సుమారు 300మంది పాల్గొంటారు. చనిపోయినవారితో ఈ సభలో పాల్గొనే కొందరు మాట్లాడుతారనీ, నోవా, నీరో, కెన్నడీ సోదరులు–వీరి ఆత్మలను "రప్పించి" వారితో మాంత్రికులు మాట్లాడుతారనీ ప్రచారం జరుగుతోంది.

### ఆర్యభట!

ఆర్యభట ప్రయోగించిన రెండవ రోజునే – ఆ విజయోత్సాహం చల్లారకుండానే – రష్యన్లు సప్లై చేసిన విద్యుత్ ఘటాలు పాడయి, విద్యుత్ సరఫరా తగ్గిపోయి ఆర్యభట చేయవలసిన 3 ప్రయోగాలను రద్దు చేశారు. ఇలాంటి "చిన్న" లోపాలు అమెరికా ప్రయోగించిన నౌకలలోనే తప్పలేదని డైరక్టరు యు.ఆర్.రావుగారు అన్నారు.

### పాఠకుల రుచి!

ప్రపంచంలో అధికంగా అమ్ముడు పోయే పుస్తకం ఏది?

ఇంతవరకు డాక్టర్ స్పాక్ వ్రాసిన శిశు సంరక్షణ గురించిన పుస్తకం. కాని యిప్పుడు, "గినీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్." ఇది సంవత్సరానికి ఒకసారి 14 భాషల్లో వస్తోంది. ఒక సంవత్సర కాలంలో రికార్డు స్థాపించిన విషయాల గురించి దీనిలో ఉంటుంది.

ఉదా: 1. ప్రపంచ లాంగ్ జంప్ రికార్డు ఎంత? (8మీ. 90సెం.)

2. ప్రపంచంలో ఎత్తైన కట్టడం ఏది? (పోలెండ్‌లోని రేడియో స్తంభం).

ఇలాంటి విషయాలన్నీ ఈ పుస్తకంలో ఉంటాయి.

### డాబా టెన్నిస్

మన అత్యుత్తమ టెన్నిస్ ఆటగాడు విజయ్ అమృతరాజ్‌ను 4 సార్లు ఓడించిన 42 సం.ల తాత కెన్‌రోజ్‌వాల్‌కి టెన్నిస్ అంటె ఎంత ప్రేమ అంటే ...

తను కొత్తగా కట్టుకున్న డాబా యింటిచుట్టూ స్థలం లేక, తన డాబా మీదనే టెన్నిస్‌కోర్టు ఏర్పాటు చేసుకున్నాడు. ప్రపంచం మొత్తంలో డాబామీద టెన్నిస్‌కోర్టు యిదొక్కటే.

—బి. శ్రీదేవి

"ఏమిటా తరుముడూ...? కాస్త ఆలస్యమయితే ఆవిడగారి ప్రాణంమీదికేం మునుకు రాదుగానీ ఆగండి కొంచెం. నేనిక్కడ కాళ్ళారజాపుకు కూచుని లేను. ప్రొద్దుటనించీ కాళ్ళరగ దొక్కుకుంటున్నా ... కనిపించటం లేదూ? అంత రంచనుగా టైముకి మీ అమ్మగారి అవశిష్టాలు తీర్చటం నావల్లకాదు సుమండీ.

అంతాగలేకపోతే పనిమనిషినే పెట్టుకుంటారో మీరే ఆమెగార్ని సేవించి తరించుతారో మీ ఇష్టమిక." అంటూ తెగేసి చెప్పింది.

మరి నోరు పెగల్లేదు శేషయ్యకి.

నిట్టూరుస్తూ తల్లితో మొహం కడిగించడానికి ఉపక్రమిస్తున్న అన్నగారికి తనూ సాయంచేస్తూ, "కాంతకి... పిల్లల మూలాన్న ... పనీ ఎక్కువై... విసుగు. అంచేత..." నసుగుతూ భార్యని సమర్థించాడు శేషయ్య తమ్ముడివంక ఒక్కసారి ఉదాసీనంగా చూసి తల్లికి పాలు కొని తీసుకు రావటానికి బయటకు వెళ్ళిపోయాడు నాగయ్య.

మూడోనాడు రంగమ్మ ఉన్నస్థితి ఎవరినైనా ద్రవింపచేసేదిగా వున్నది.

సైగచేద్దామంటే అవసరసమయానికి ఎవరూ కనబడనందున, పిలిచి చెప్పేటందుకు గొంతువిడక, ఉగ్గబట్టుకునే ఓపిక

## లోకం పోకడ

లేక మలమూత్రాలు పక్కలోనే విడిచింది రంగమ్మ.

ఆ దుర్భరమైన వాసననీ తలపుమాత్రంగానె జుగుప్స కలిగించి, ఒళ్ళు జలదరింపచేసే పల్మశం శరీరాన్ని తాకుతూంటే కలుగుతున్న అసహ్యాన్ని భరించలేక, భరించక చేసేదేమీ లేక నిస్సహాయంగా బతికుండే నరకాన్ని చవి చూస్తోంది రంగమ్మ.

తల్లి నా దుస్థితిలో చూస్తూ నీరుగారిపోయాడు నాగయ్య 'కన్నులున్న అంధత్వం కావాల్సినదీ సమయాల్లోనే.' అనుకున్నాడు కనుకొనల్లో పూరిన తడిని కండువాతో ఒత్తుకుంటూ.

బావగారిని గమనించిన లక్ష్మీకాంత పెరట్లోనే పురాణం విప్పింది.

'పనిమనిషి ఇంతవరకూ రాలేదట; దుర్వాసనతో ఇల్లు పాయిఖానా అనిపిస్తోందట; పిల్లలు ఇంట్లో నిలవలేక వాకిట్లోనే ఉన్నారట ఇప్పటిదాకా; ఆనీ ఛండాలాలన్నీ సహిస్తూ వుండలేకపోతున్నదిట; ఏనుయ్యో గొయ్యో చూసుకుని ఈ యమచర తప్పించుకోవాలనుకున్నదిట; ఇంతకీ ఏనాడో తను చేసుకున్న పాపం ఈ రోజున ఈ రూపంగా తనని పట్టిపల్లారుస్తున్నదిట...' ఆనకట్ట లేని ప్రవాహచందాన ఇలా సాగిపోతున్నదామె ధోరణి.

'చెవులుండీ బధిరత్వం నాకెందుకొసగలేదు భగవాన్.' అనుకున్నాడు నాగయ్య అశాంతిగా కణతలు రుద్దుకుంటూ.

అప్పుడే దిగడిన పనిమనిషి రంగమ్మ పక్క బట్టలు మార్చి ఒళ్ళు శుభ్రం చేసింది. నాగయ్య వెచ్చచేసి తీసుకొచ్చిన పాలు ఆమె చేత తాగిస్తూ రహస్యంగా వెల్లడించిందొక విషయం.

ఈ మూడు రోజులబట్టీ నాగయ్య స్వయంగా ఇచ్చి వెడుతున్న ఈ స్వల్ప ఆహారం తప్ప తల్లికి పగలంతా మరే ఇతర ఆహారమూ ఇవ్వటంలేదట. రాత్రి అయ్యేవరకూ అలా ఆ ఖాళీ కడుపుతోనే పడి వుంటున్నదట రంగమ్మ.

మమతానురాగానికి దూరంగా వుండాలనుకుంటూ అన్నింటా విరక్తి ఏర్పరుచుకుంటున్న నాగయ్య చలించిపోయాడా సంగతి విని.

'మనస్సుండీ నిర్వికారత్వం నాకెప్పుడను గ్రహిస్తావు ప్రభూ!' అని ద్రవించిన హృదయంతో మొరపెట్టుకున్నాడు కనిపించని ఆ వేలుపుతో.

ఆ సాయంత్రమే తల్లిని తన ఇంటికి తీసుకుపోయాడు నాగయ్య.

ఏదో లాంఛనానికి తప్ప పెద్దగా అభ్యంతర పెట్టలేదు తమ్ముడూ మరదలూను.

జగన్ మిధ్య అంటూ శుష్కవేదాంతం మాటున బాధ్యతను విస్మరించే కువేదాంతిలా కాక కర్తవ్య నిర్వహణలోనే ముక్తిమార్గాన్ని వెతుక్కోవాలనే జ్ఞానం కలవాడు నాగయ్య.

భార్యా వియోగం కలిగినప్పుడూ, చంచలాక్షి అయిన లక్ష్మి అనుగ్రహం తప్పి ఆస్తిపాస్తులు ఊడ్చుకుపోయినప్పుడూ, నా గతి ఏమా అని తల్లక్రిందులయిపోక, తిరిగి వ్యాపారాన్ని పునరుద్ధరించుకోవాలనీ, కుటుంబ లంపటంలో మళ్ళీ తలదూర్చాలనీ తాపత్రయాలు పెంచుకోక నిర్విచారంగా ఎలాగయితే వైరాగ్య పథాన్నవలంబించాడో అదే విధంగా తల్లికి తనసేవ అవసరమని గ్రహించిన తక్షణం నిస్సంకోచంగా ఆ బాధ్యత స్వీకరించాడు.

తన శాయశక్తులా ప్రయత్నించి తల్లి చివరి రోజులు ప్రశాంతంగా గడిచిపోయేటట్టు చూడటమే తన ప్రస్తుత ధ్యేయంగా పెట్టుకున్నాడు.

అన్నం మెత్తగా కలిపి ముద్దలుచేసి చంటి పిల్లడికి తినిపించినట్టు నోటికి అందిస్తూంటేనూ, జుట్టుకి నూనెరాసి చిక్కుతీసి ముడి వేస్తూంటేనూ, మలమూత్రాదులు సయితం చిరాకు పడక ఎత్తిపోస్తుంటేనూ,— 'ఆఖరికి ఈలాంటి పనులు గూడా మగబిడ్డడితో చేయించుకోవలిసి వచ్చిందే—' అని సిగ్గుతో కుచించుకుపోయేది రంగమ్మ.

అది గమనించి, "ఇంతకు మించిన సేవలెన్నో చేస్తేనే ఈనాటికి ఇంతవాళ్ళమయ్యాము మేము. నువ్వు చేసిన సేవలో సహస్రాంశం పుండదు నేను నీ కిప్పుడు చేసేది. నీళ్లుపోసి పోషణచేసి పెంచిన చెట్టునించి కాయకోసుకునేటందుకు బిడియపడతావెందుకమ్మా?" అనేవాడు చల్లగా నవ్వుతూ.

మధ్యాహ్నంపూట నాలుగు మెతుకులు ఇలా కతికేవాడో లేదో ఏ పోస్టాఫీసుకో పరిగెత్తేవాడు. రాత రానివాళ్లు ఆ వూళ్లో కొల్లలు. ఎవరికయినా ఉత్తరాలో, కవుళ్ల కాగితాలో రాసిపెట్టి వాళ్లిచ్చిన పైసో పావులో తీసుకుని, అది పెట్టి పండో ఫలమో కొని తల్లికి ఆపేక్షగా తినిపించేవాడు.

రంగమ్మ తల్లి మనసు 'నా కోసమెంత ప్రయాసపడుతున్నాడో గదా నా బిడ్డ!' అన్న మధనతో కృంగిపోయి, 'నేనంటే ఎంత ప్రేమో నా నాయనకు' అన్న భావనతో పొంగి పోయేది.

పగలు తీరుబాటు అయినప్పుడు తల్లి మంచం పక్కంటే కూర్చుని అరవిందుని గ్రంధమో, గీతా వాఖ్యానమో పైకి చదివి వినిపిస్తో తనకి అవగతమయినంత వరకూ వాటి సారాన్ని ఆమెకు వివరించి చెప్పేవాడు నాగయ్య.

రాత్రి నిద్రపోయే ముందు ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలో, గీతగోవిందమో, భాగవతంలోని పద్యాలో గొంతువిప్పి కమ్మగా పాడేవాడు.

మనస్సు నిర్మలంగా భగవంతుని సంస్మరణంలో పరవశించి పోతుండగా...హాయిగా... ప్రశాంతంగా ఎప్పుడో తనకు తెలియకుండానే సుషుప్తిలో మునిగిపోయేది రంగమ్మ.

* * *

పల్లెటూళ్లలో పట్నవాసంలోలాగా పక్కవాళ్ల సంగతి పట్టించుకోకుండా ఎవరెట్లాపోతే మనకేమనే దృక్పధంలో వుండరు.

తప్పు కనిపించినా, మామూలుకు భిన్నంగా ఏదయినా జరిగినా వూరూ నాడూ ఏకమై తూర్పార బట్టేస్తుంది.

ఈ గుణం పరిస్థితులనిబట్టి ఒక్కొక్కప్పుడు చెడు నడతను బడ్డవాడికి బుద్ధిగరిపి మంచి దారికి మళ్లేదిగానూ ఉండవచ్చు; మరొకప్పుడు మూర్ఖత్వానికి దారితీసి మంచి మనిషికే ఘోరమయిన హింసగా పరిణమించనూ వచ్చు.

ఈత వెనకబట్టి పట్టిపోయిన గోవుని దానం పేరిట గో సంరక్షణకి తోలినట్టు, చేసినన్నాళ్లు చేయించుకుని మూలపడ్డాక తల్లిని అన్న ఇంటికి అప్పగింతలు పెట్టిన శేషయ్యని వూళ్లో అందరూ దుయ్యబట్టసాగారు. చాకలి వెంకి మొదలుకొని వూరికి పెద్ద కామందయిన రాఘవరెడ్డి వరకూ చిన్న పెద్దా అందరి దృష్టిలోనూ శేషయ్య పలుచనై నాగయ్య ప్రశంసా పాత్రుడయినాడు.

నిర్మొహమాటస్తులు కొందరు శేషయ్యనీ, లక్ష్మీకాంతనీ 'ఇదే మన్యాయం. మీకుమాత్రం రాదా పెద్దతనము'ని మొహమ్మీదే అడిగారు కూడా.

శేషయ్య అయితే దొంగకి తేలుకుట్టినట్టు మెదలకుండా వూరుకునేవాడు; నీళ్ళు నములుతూ విషయాన్ని దాటెయ్యడానికి ప్రయత్నించేవాడు; విన్నబోయిన మొహంతో చిన్న బుచ్చుకునేవాడు.

ధూర్తత రెండు విధాలు. పైకి కప్పిపుచ్చాలని చూసినా కనీసం మనసులోనైనా చేసిన తప్పపనిని తప్పే అని ఒప్పుకోగలగటం; అలాటివాడే శేషయ్య.

ఇక రెండోరకం. తన తప్పుని మనస్సా వాచా సమర్థించుకోవటమేకాక తప్పుని చెప్పిన వాళ్ళదే తప్పుని ఎదురు తిరగటం; ఆ బాపతే లక్ష్మీకాంత.

ఇదేమన్న వాళ్లమీద విరుచుకు పడేది లక్ష్మీకాంత. వాళ్ల మూడు తరాల క్రింద నలుపులన్నీ వెతికి మీరూ పత్తిత్తులు కారులెమ్మని వాళ్ళ నోరు మూయించేది; అంత జాలిగల వాళ్ళు తీసికెళ్లి పోషించి చూడండని సవాలు చేసేది; పైగా వీళ్ళందరినీ ఉసిగొలిపి తమ మీదికి తరిమేది బావగారేనంటూ ఏ పాపమెరుగని నాగయ్య మీదకూడా నాలుగక్షింతలు వేసేది.

కపటంలేని నాగయ్యమటుకు తమ్ముడూ మరదలూ ఊరందరి నోళ్లలోనూ నాను



ఊండటం చూసి కష్టపడేవాడు. "ఇన్నేళ్ళ అమ్మని అరిచేతుల్లో పెట్టుకుని అపురూపంగా చూసింది వాళ్ళుకదా! ఇప్పుడయినా వాళ్ళేం తోసి పంపలేదు. మాతృఋణం నాకు మాత్రం తీరేదెప్పుడని పట్టుబలవంతాన నేనే తీసుకొచ్చానింటికి." అనే చెప్పేవాడందరికీ.

అయితే అతనాశించినట్లు లోకుల ధోరణి గానీ, అభిప్రాయంగానీ మారలేదు. కాగా తనని నిందించే వారి తప్పుల్ని సయితం దాచ జూస్తున్న అతని క్షమాగుణాన్నీ, లక్ష్మీకాంత గయ్యాళి గచ్చుతనాన్నీ మునుపుకన్న ఎక్కువగా చెప్పుకోసాగారు.

* * *

ఎవ్వరేమనుకుంటున్నా కాలం మాత్రం ఆగలేదు. తెరిపి లేకుండా వచ్చి పడుతున్న ఘడియల్నీ, దినాల్నీ వెనక్కి నెట్టేస్తూ ముందుకు సాగిపోతూనే వుంది.

ఈ మధ్యలో రంగమ్మకి మరోసారి హెచ్చుచేసి తగ్గటం జరిగింది. ఈసారి స్ట్రోక్‌వస్తే బ్రతుకుతుందనేది అనుమానమే నని అన్నాడు పట్నంనించి వచ్చిన డాక్టరు.

నాగయ్య కంటికి రెప్పలా కాచుకుంటున్నాడు తల్లిని. కాని గెలకొట్టిన అరటి చెట్టుకి ఎంత బలంవేసినా లాభం లేనట్లు ఆయుర్దాయం తీరిపోవస్తున్న రంగమ్మకి అతని పరిచర్యలుగానీ తీసుకుంటున్న మందులు గానీ ఒంటబట్టడంలేదు. రోజు రోజుకీ దిగజారిపోతున్న ఆరోగ్యంతో ఔటర్‌లో సిగ్నల్ కోసం కాచుకునున్న రైలుబండిలా భగవంతుని చే సంజ్ఞకోసం నిరీక్షిస్తోంది రంగమ్మ.

# లోకం పోకడ

ఆ పిలుపు రావటానికి గూడా ఎంతో కాలం పట్టలేదు. పక్షవాతం మూడో మారు తిరగ బెట్టింది.

ఆ రోజు రంగమ్మ కళ్ళు తప్ప మిగతా అవయవాలన్నీ స్వాధీనం తప్పాయి. కొండెక్కబోయే దీపంలా రెప రెప లాడుతోందామె ప్రాణం.

డాక్టరు వచ్చి పెదవి విరిచి వెళ్ళిపోయాడు. ఆవరిస్తున్న విషాదంలో కర్తవ్యతా శూన్యుడై కూర్చుండి పోయాడు నాగయ్య.

ఎక్కడ పుట్టినా ఆ వూరుని మెట్టి అక్కడే మట్టయిపోతున్న ఆ వూరి కోడలామె.

సంగతి తెలిసి ఇరుగుపొరుగులూ, తెలిసిన వారూ ఒక్కొక్కరూవచ్చి చూసిపోతున్నారు.

వారిలో ఒకరు అడుగుతున్నా రింకెవరినో. "శేషయ్య కనబడడేం? కబురందలేదా ఏం?" అంటూ.

"పంపకేం? గంటాయె పిల్లగాణ్ణి పంపి. ఇప్పటిదాకా అయిపూ అజా లేదు పెద్ద మనిషి." నిరసనగా జవాబిచ్చారు ఎవరో.

గప్పున స్ఫురించింది నాగయ్యకి అప్పుడున్న వెలితేమిటో. 'ఈ వచ్చి పోతున్నవాళ్ళందరూ కేవలం గట్టున నిలబడి సానుభూతి చూపించే వాళ్ళే తన దుఃఖంలో పాలుపంచుకొనేవాడు తమ్ముడొక్కడే' అని.

వెంటనే లేచి తమ్ముడికోసరం వెళ్ళబోయాడు. అతన్ని అడ్డుకున్నదో ఇల్లాలు.

"ఎందుకయ్యా నువ్వు పరిగెత్తేది? ఆయనకులేని ఆరాటం నీకెందుకంట? అయినా ఆ ఇంటికి ఈ ఇల్లెంత దూరమో ఈ ఇంటికి ఆ ఇల్లూ అంతే దూరమన్నారు. ఈ తల్లిమీద ఆపేక్ష ఆ కొడుక్కి ఎప్పుడైతే ఎగిరిపోయిందో-ఆ కొడుకుమీద ప్రీతి ఈతల్లికి అప్పుడే అడుగంటింది. నన్నడిగితే ఆవిడకి నువ్వొక్కడివే కొడుకువంటాను. జవముడిగాక విధికిడ్చిన కొడుకొక కొడుకా అని? అతనికోసం నువ్వేం పరుగులు పెట్టనక్కరలేదు గానీ అక్కడికాగు." ఖండితంగా అన్నదామె.

"అవునవును." "నిజం చెప్పావు." "బాగా చెప్పావు." ఇత్యాది విశేషణాలతో అక్కడున్న వాళ్ళందరూ ఆమె వాదన ఆమోదిస్తూ తలలూపారు.

'పరిస్థితులకి తలవంచి తనని కొంత చిన్న చూపు చూచినంత మాత్రాన, బిడ్డమీద తల్లికి మమతా, మమకారం మాసిపోతుందా? నమ్మశక్యం కానిసంగతి.'

తల్లిదగ్గరగా వెళ్ళాడు నాగయ్య. "ఏమ్మా శేషుని చూడాలని లేదూ?"

రంగమ్మ నీళ్ళునిండిన కళ్ళలో ఆందోళనా, ఆత్రుతా స్పష్టంగా అగుపడింది.

"నే వెళ్ళి పిలుచుకురానా?"

క్షణంలో ఆమెకళ్ళు వెలిగాయి. చెంపలంట కన్నీరు దిగజారింది.

ఇక ఎవరిమాటా లక్ష్యపెట్టలేదు నాగయ్య.

శేషయ్య వచ్చిన కొద్దిసేపట్లో రంగమ్మ ప్రాణాలు గాలిలో కలిశాయి. పోయేముందర తల్లికళ్ళలో గొప్ప సంతృప్తి చూడగలిగేడు నాగయ్య.


* * *

రంగమ్మ పోయిన మూడవరోజున, "ఏం నాగయ్యా! కర్మ మొదలుపెట్టాలిహ." అంటూ వచ్చాడు పురోహితుడు.

దిన వారాలకి కావాలిసిన వస్తువులంటూ ఆయన వ్రాసుకొచ్చిన రెండు పేజీల జాబితా కేసి చూస్తూ తల తడుముకున్నాడు నాగయ్య.

జీవుడు; వైతరణి; పుత్రుడు: పున్నామ నరకం; ఏడాది గ్రాసం; గోదానం, భూదానం; సువర్ణదానం; అన్నదానం ... ఏవేవో ఏకరువు పెడుతున్నాడాయన.

వింటూ వుండిపోయాడు నాగయ్య.



ఆకలి దప్పులకీ, మాయా మమకారాలకీ లొంగే ఈ శరీరాన్ని విడిచి పంచభూతాల్లో లీనమయిపోయిన జీవికి కూడా బాధలూ బంధాలూ అంటగట్టి ఏవో క్రతువులూ కర్మలతో వాటిని తొలగిస్తామంటారు.

పితృదేవతలకంటూ బతికివున్న వారికి దానాలిమ్మని అది మరణించిన వారికి చెందుతాయంటారు.

వీటికి రుజువులేదు. చెప్పే సాక్ష్యాధారాలు కల్పితాలు. అయినా వాట్లని తప్పనిసరిగా నమ్మాలి; లోకానికి వెరిచన్నా ఆయన చెప్పిన వన్నీ ఆచరించి తీరాలి.

ఆయన ప్రసంగం ఆఖరయింది. ఈ తతంగాలమీద పెద్దగా నమ్మకం లేకున్నా ఏటికి ఎదురీదే రకంకాదు నాగయ్య.

కానీ ఎలాగని? నాగయ్య మరోసారి తల తడుముకున్నాడు.

తల్లి వచ్చినప్పటినించీ అక్కడక్కడా చిన్నం చితకా మొత్తాలు చేబదుళ్ళు తెచ్చాడు. ఇల్లయితే ఎప్పుడో తాకట్టు పెట్టేశాడు. అది అమ్మి అప్పులు తీరిస్తే మిగిలేది హళ్ళికి హళ్ళి–సున్నకి సున్న.

నాగయ్య లోపలికి వెళ్లి పదిరూపాయలూ, ఒక పదిపైసల బిళ్లా పట్టుకొచ్చాడు. తాంబూలంలో వుంచి పురోహితుడి చేతిలో పెట్టి తల్లిని తలుచుకుని రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేశాడు.

క్షణం వెలవెలబోయి, అంతలోనే అతని భావం అర్ధమయి నొసలు చిట్లించాడు పురోహితుడు.

ఆ పైన హితబోధ ప్రారంభించాడు; కొడుకనీ, కర్తవ్యమనీ ఏవేవో అరగంటసేపు వల్లించాడు.

తర్కించలేదు. అన్నింటికీ ఒకటే సమాధానం చెప్పాడు. "ఇంతకుమించి నాకు శక్తి లేదు" అని.

డబ్బు రొంటిన దోపి గొణుక్కుంటూ వెళ్లిపోయాడాయన.

* * *

మర్నాడు చిరచిరలాడుతూ పైకొచ్చే సూరీడుతోపాటు నాగయ్య తల్లికి పిండంవేసి తర్పణాలు వదలనన్నాడన్న వార్త కూడా చరచరా వూరంతా వ్యాపించిపోయింది.

చిత్రమేమిటంటే ఈ వార్తకి అనుబంధంగా జోడించి చెప్పుకుంటున్న మరో సంగతి;

శేషయ్య పెద్దఎత్తున కర్మ ప్రారంభిం

(42 వ పేజీ చూడండి)

విటమిన్లు మరియు ఖనిజములు
మీ కుటుంబము యొక్క ఆరోగ్యమునకు ఎంతో అవసరము



వారికి తగినన్ని లభిస్తున్నాయా?

అవి లభించకపోతే, వారికి ప్రతి రోజూ విమ్‌గ్రాన్ బిళ్ళ యివ్వండి. రోజంతా మీ కుటుంబంలోని వారందరినీ ఉత్సాహంగా, శక్తివంతంగా ఉంచేందుకు విటమిన్లు, ఖనిజ పదార్థాలుగల విమ్‌గ్రాన్ వాడండి.

విమ్‌గ్రాన్®
వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు
11 విటమిన్లు + 8 ఖనిజ పదార్థములు






SQUIBB®
SARABHAI CHEMICALS LTD.

® ఇ.ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి రెజిస్టర్డ్ ట్రేడ్ మార్క్కు చిహ్నం. దీని లైసెన్సుడు ఉపయోగదారులు ఎస్‌సిఎల్.

ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది

Shilpi-SC-2A/75 (e)

# వారఫలం

మహేష్

8-8 1975 శుక్రవారం మొదలు
14-8-1975 గురువారం వరకు

**మేషం :—** వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. సాటివారితో మాట పట్టింపులు తగవు. ఇతరుల నిమిత్తం శ్రమకు గురికాగలరు. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేర తాయి.

**వృషభం :—** మీ మంచితనమే మీకు ఇబ్బం దిని కలిగిస్తుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. సాహిత్య కళారంగాలల్లో ఖ్యాతి లభి స్తుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. స్త్రీలకు— బంధుమిత్రులను కల్సు కొంటారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**మిధునం :—** అనుకూలమయిన వార్తలను వింటారు. మీ కార్యక్రమాలు చురుకుగా సాగు తాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

**కర్కాటకం:—** మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో అనుకూలమయిన వార్తలను వింటారు. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు హడావుడిగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువులకు సహాయం చేస్తారు.

**సింహం :—** వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవ హారాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమయిన సమాచారం అందుతుంది.

**కన్య :—** ప్రయోజనం లేని శ్రమ కల్గుతుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాలల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

**తుల :—** ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**వృశ్చికం —** అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో అనవసరమయిన శ్రమ కలుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

**ధనుస్సు:—** మీ కార్యక్రమాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాహసికవ్యవహారాలు లాభించ గలవు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాలల్లో ఖ్యాతి లభిస్తుంది.

**మకరం :—** ఆందోళన కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహా రాలల్లో శ్రమ కలుగుతుంది. అనుకూలమయిన వార్తలను వింటారు.

**కుంభం:—** వృత్తిలో ముఖ్యమయిన వ్యక్తులను కలుసుకుంటారు. రావలసిన డబ్బు అందుతుంది. వారం మధ్యలో శ్రమ కలుగుతుంది. మీ ప్రయ త్నాలకు ఆటంకం రాగలదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

**మీనం :—** సాటివారితో వాద ప్రతివాదాలు తగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఇతరులతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో లాభంరావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరం కోసం వ్యయంచేస్తారు.

## లోకం పోకడ

(11 వ పేజీ తరువాయి)

చేడుట. పెద్దదినం ఏర్పాట్లు కూడా బ్రహ్మాం డంగా చేస్తాట్ట.

"పెద్ద కొడుకువి నువ్వు నీ చేత్తో వది లిన ఉదకమే నీ తల్లికి ఉత్తమగతులు ప్రాప్తింపచేసేది." అనంటూ నాగయ్యకు శాస్త్ర విధులు విప్పిచెప్పిన పురోహితుడుగారే ఈ రోజున అన్న పేరెత్తకుండా తమ్ముడి చేత యధావిధిగా కర్మకాండలు జరి పిస్తున్నాడు.

తన తప్పులేకుండా చేసుకుందామని కాబోలు, "పెద్ద కొడుకు ముఖ్యమంటారు. అన్నయ్యని పిలిపిస్తాను." అని శేషయ్య నామ కహా పురోహితుడితో అనబోతే లక్ష్మీకాంత చిచ్చుబుడ్డిలా లేచింది. "సొమ్ము నీదీ—షోకు నాదీ అని మధ్య ఆయన పెద్దరిక మేమిటీ? వూరుకోండూరుకోండి" అని తోసి పారేసింది

పురోహితుడుకూడా ఆవిడ మాటలకి మద్దతిచ్చాడు. "కొడుకన్న తరవాత పెద్దేమిటి చిన్నేమిటి లేవయ్యా ! మీ అన్నయ్య వాలకం చూస్తే ఈ శాస్త్రాలమీద నమ్మకమున్నట్టు కనబడలేదు. అట్లాంటి వాడిచేత బలవంతాన కర్మచేయించితే దానిఫలం మీ అమ్మకందు తుందన్న నమ్మకం నాకులేదు." అని దంజం సవరించుకుంటూ పెదవి విరిచాడాయన. ఆ సమయంలో కాంతకి వంత పాడితే సంభావ నలు అడక్కుండానే రెట్టింపు ముట్టుతాయి మరి.

ఆశించిన సమాధానాన్నే అందుకున్న శేషయ్య మరి ఆప్రస్తావన ఎత్తుకోలేదు. బయట పడడుగానీ ఈ దెబ్బతో వూళ్ళో తమవైపు వీస్తున్న తిరస్కారపు వాయువులు తేలగొట్టాలని అట్టహాసంగా చేస్తున్న ఈ కర్మకాండ పధకంలో అన్నగారికి వాటా ఇవ్వటం నిజానికి శేషయ్యకి ఏమాత్రం ఇష్టం లేదు. లక్ష్మీకాంత సరేసరి. ఆగాలి ఏదో విధాన బావగారి వేపుగా సాగారితే మరీ సంతోష మామెకి.

అందుకనే అత్తగారి దినవారాలకి భర్త ఎంత డబ్బు వెదజల్లుతున్నా ఆటంకపెట్టడం లేదు. బావగారు కర్మ చెయ్యనన్నాడన్న సంగతి అడిగినవాళ్ళకి సరే — అడగనివాళ్ళకి కూడా పిలిచి చెబుతోంది. "ఆయన మనసు రాయిగాబట్టి మానగలిగేడు కానీ మాకు ప్రాణం ఒప్పలేదమ్మా" అంటూ తమ సులి మెత్తని గుణాల్ని ప్రదర్శిస్తోంది.

తల్లి చావు కాదుగానీ శేషయ్య ఇల్లు వారం రోజులపాటు పెళ్ళి వారిల్లులా కలక ల్లాడిపోయింది.

మూడూళ్ళ అవతలనించీ గరుడపురాణం చెప్పే శాస్త్రులుగారిని రప్పించాడు. ఆయన

పురాణం వినిపించే రెండు వేళల్లోనూ వూళ్ళో మూడువంతులజనం శేషయ్యగారి చావిట్లోనే వుండేవారు.

ఆ వారం రోజులూ శేషయ్యఇంట్లో గాడిపొయ్యలు మండుతూనే వున్నాయనీ, వూళ్ళో బీదాబిక్కి జనాలు పొయ్యలు రాజెయ్యలేదనీ అందరూ మహా విశేషంగా చెప్పుకున్నారు.

పదీ పదకొండూ చిన్నదినమూ పెద్ద దినమూ ను: ముఖ్యమైన ఈరెండు రోజులూ మాత్రం వూరందరితోపాటు అన్నగారినీ ఆహ్వానించాడు శేషయ్య. నాలిక చివర్నించే ఆ పిలుపని తెలిసినా 'వాడితో నాకు శతృత్వమేమి'టనుకున్న నాగయ్య తమ్ముడింటికి వెళ్లటంమానలేదు.





ఒకే ఒక్క సారిడన్ చాలు

ట్రేడ్ మార్కు 'రోష్'

HT-RP 8613

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి



## "మేల్ మాయిల్ మందు"

నల్లరంగు, యెఱ్ఱ రంగు, పొడలు, దద్దులు, గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందున ఏర్పడు వినుగు పుట్టించు రణములు మొదలగు

**దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి**

వివరములకు

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P.O.) N.A. Dt.



## మజాగా, హుషారుగా, కసిగా యవ్వనాన్ని జుర్రుకోండి!

కసిగా దూకవలసి వచ్చినప్పుడు చచ్చుబడిపోయి ఊరుకుంటారా? మీ కోసం కాసుకున్న యవ్వనాన్ని జుర్రుకోండి. మీరు మాత్రం ఎందుకు వదులుకోవాలి? వేలునొక్కితే చాలు వెండి పూత గల మెరిసే బిళ్ళలు. నేటి టానిక్ రసగుళికలు. కాలం బేజారినా, మీరు బేజారు కాకండి. ఎడతెరిపి లేకుండా, శక్తితో, నిండుగా యవ్వనంతో కులకండి.

శక్తివంతమైన జీవనానికి

**ఒకాసా**

హార్మో-ఫార్మా లిమిటెడ్
లండన్-బెర్లిన్ వారి ఉత్పత్తి
(పురుషుల కోసం వెండి పూత గల బిళ్ళలు)
పేరెన్నికగన్న అన్ని మందుల దుకాణాల్లోనూ దొరుకుతుంది.

OKASA CO.PVT.LTD., 12K Gunbow Street, P. B. No. 396 Bombay-400001






## పురావస్తు మరియు చారిత్రక ప్రాధాన్యత గల వస్తుచయముల సేకరణ

1975 ఆగస్టు నెలలో ప్రారంభమగు, చారిత్రక ప్రాధాన్యత పత్రముల కొనుగోలుచేయు కమిటీవారు పురావస్తు మరియు చారిత్రక ప్రాధాన్యతగల వస్తుచయములకు సంబంధించిన (i) చారిత్రక పత్రములు (ii) పూర్వకాలపు వ్రాతప్రతులు (iii) భారతదేశ చరిత్రలో ప్రధాన భూమిక వహించిన ప్రఖ్యాత పురుషుల, ప్రభుత్వ ఉన్నతాధికారుల, రచయితల, విజ్ఞాన శాస్త్రజ్ఞుల వగైరాల స్వంత పత్రములు ఖరీదుచేసి, సేకరించుటకై సమావేశము కాదలచియున్నారు. (నాణెములు, ఫిలింలు, ఫొటోలు, వ్రాతప్రతులు, ఆయుధములు, మృణ్మయ పాత్రలపై చిత్రములు, పూసలు వగైరాలు ఖరీదు చేయబడవు.)

పైన తెలుపబడిన వర్గములకు చెందిన వస్తుచయమును విక్రయింప చూపదలచిన వ్యక్తులు తమ వద్దగల సామగ్రియొక్క పట్టీలు వరుస క్రమములో తేదీ 9 ఆగస్టు 1975 నాటికి శక్రటరీ, హిస్టారికల్ డాక్యుమెంట్స్ పర్చేస్ కమిటీ, నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా, జనపథ్, న్యూఢిల్లీ—1 వారికి పంపవలెను.

అమ్మకమునకు చూపెట్టిన వస్తువు, అడుగబడనిదే పోస్టు ద్వారా పంపకూడదు.

davp 511(31)/75


## లోకం పోకడ

తల్లికి తానొక్కడే పుత్రుడన్నట్లు తమ్ముడు ఒక్కడే కర్మచేస్తూంటే పరాయివాడిలా ఒకమూల నిశ్శబ్దంగా కూర్చుని చూస్తున్న నాగయ్యని ఎందరు ఎన్నిరకాలుగా అనుకున్నారో అతను వినలేదు; విన్నా పట్టించుకోలేదు.

కానీ ఆ ప్రలాపాల కోసమే కాచుకునున్న వాళ్ల వీనులకు విందులు చేశాయి. మనస్సులానంద పరిపూర్ణాలయ్యాయి. ఆ ఉత్సాహంలో దాతృత్వం అతిశయించింది శేషయ్యకి, లక్ష్మీకాంతకీని.

భూదాన మిచ్చాడు; సువర్ణదానమిచ్చాడు; వస్త్రదాన మిచ్చేడు; 'నందినీదేవి'లాంటి గోవుని వత్సంతోపాటు, వెండి గిట్టలూ బంగారు కొమ్ములతోసహా స్వద్బ్రాహ్మడికి ధారపోశాడు.

'పాత్తర్లందుకున్న బ్రాహ్మణుల సంచులు నిండి పొర్లినాయి. దిట్టంగా సంభావనలందుకున్న బ్రాహ్మణుల ఆశీర్వచన పనసలతో ఇల్లు మార్మోగింది.


కర్మకాండ యావత్తూ నిరాటంకంగా ముగిసింది.

వంటవారు ఆకులుపరిచి వడ్డనసాగించారు. నాలుగు పిండివంటలూ, నాలుగు కూరలూ, నాలుగు పచ్చళ్ళూ ఆకులు నిండుగా నోరూరిస్తున్నాయి. అందరూ భోజనాలకి ఆయత్తపడుతున్నారు. ఇక పిండాన్ని కాకులు ముట్టడమే తరవాయి.

చుట్టూరా చెట్లనిండా లెక్కలేనన్ని కాకులు. కానీ ఒక్కటీ పిండముంచిన ఆకుకేసి రావటంలేదు. ఎంత ప్రయత్నించినా అరిచి హంగామా చేస్తున్నాయే తప్ప లంచం చాలని ఆఫీసర్లలా ఎంతకీ చెట్టు దిగటంలేదు.

జనాన్ని చూసి బెదురుతున్నాయంటూ అందర్నీ లోపలికి నెట్టేశారు కొందరు. 'ఏం దోషం జరిగిందో తప్ప మన్నించమని దణ్ణాలు పెట్టండ్రా' అంటూ సలహాలిస్తున్నారు కొందరు; ఏమి కోరికలు మిగిలిపోయాయో అని అనుమాన పడుతున్నారు ఇంకొందరు; ఆవిడకిష్టమయిన వంటకాలేవో వండించి తెచ్చిపెట్టమని తొందర చేస్తున్నారు మరికొందరు.

ఏమిచేసినా, ఎన్నితిప్పలు పడినా ఆ వాయసరూపంలో ఉన్న పితృదేవతలు మాత్రం కరుణించలేదు.




కాలము గడిచిపోతున్నది. వేళ మించిపోతున్నది. ఏం చెయ్యాలో తోచని అయోమయంలో పడిపోయారంతా.

అప్పుడే ఎవరినోటంటనో సన్నగా ఊడిపడ్డదో మాట విసురు.

"ఆవిడకికిట్టనివాళ్లున్నారేమోఇక్కడ?"

"ఎవరబ్బా వాళ్లు?"

ఎంత తల్లయితే మాత్రం పిండమెయ్యాని కొడుకంటే మనస్సు విరగదా?"

"నాగయ్య సంగతా నువ్వనేది?"

"ఏమోనబ్బా. నాకు తోచినదేదీ మనసులో ఉంచుకోలేను నేను. ఖర్మం."

అంతే. క్షణంలో ఈ అనుమానం లోగిలంతా అల్లుకుపోయింది. అదేం కోర్టు తీర్పా? వాయిదాలు పడి నెలలు గడిచిపోటానికి? అదే కారణమని వెంటనే నిర్ధారణగా నిర్ణయం గూడా అయిపోయింది.

ఎక్కడో ఒదిగి కూర్చున్న నాగయ్య అప్పటికప్పుడు అందరికళ్లకి రూపుకట్టిన శత్రువులా కనిపించాడు.

నాగయ్య మెల్లగా లేచాడు. తనకేసి పులుకూ పులుకూ చూస్తున్న లన్ని జతల కళ్ళనీ ఒక్కసారి తదేకంగా చూశాడు. కొన్నాళ్ళక్రితమే ఈ కళ్ల తాలూకు నోళ్లే తనని ఆకాశానికెత్తాయి. ఇప్పుడా పొగడ్తల తాలూకు ఛాయలు లవలేశమయినా కనిపించటంలేదు.

అతనికి వెర్రిగా నవ్వాలనిపించింది.

గిరున వెనక్కి తిరిగి తన ఇంటివేపుగా నడక సాగించాడు.

మబ్బుకమ్మిన ఆకాశంలో గ్రద్దలు గిరికీలు కొడుతున్నాయి. హోరుగాలికి వృక్షాలు శివాలెత్తినట్టు తలలూపుతున్నాయి.

నాగయ్య భుజంమీది కండువా నిలవలేనట్టు కిందికి జారుతోంది. ఎదురుదెబ్బ తగిలి కాలివేలు చిట్లి రక్తం వస్తోంది.

నాగయ్య నడక ఆపలేదు; వంగి కాలయినా చూచుకోలేదు; సరాసరివెళ్లి ఇంటి తలుపులు తెరిచాడు. ఎదురుగా గోడకి రంగమ్మ ఫోటో వేలాడుతోంది. అంతవరకూ అణుచుకున్న ఆవేదన ఒక్కసారిగా పెల్లుబికింది.

'నిజం చెప్పమ్మా నేనంటే మనస్సు విరిగిందా నీకు? దెబ్బతిన్న గుండె మూగగా చేసిన ఆర్తనాదమది.

ఫోటోలోంచి తల్లిచల్లగా నవ్విన అనుభూతి. "చింతపడకు నాయనా! లోకం తీరది. దాన్ని లెక్కచెయ్యకు." తలనిమిరిన మృదువైన స్పర్శ. నాగయ్య సర్వం మరిచి పరవశించి పోయాడు. [అయిపోయింది]

**Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3, Editor: S. Radhakrishna**